# బాల వికాస సంస్థకు చోళమండలం కంపెనీ రూ.97 లక్షల విరాళం

ముకరంపుర (కరీంనగర్), మార్చి 23: చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న చోళమండలం ఇన్వెస్టిమెంట్స్, ఫైనాన్స్ కంపెనీ తెలంగాణలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బాలవికాస్‌కు రూ.97 లక్షల విరాళాన్ని సిఎస్‌ఆర్ ప్రోగ్రాంలో భాగంగా ప్రకటించారు. జిల్లాలోని గ్రామాలను దత్తత తీసుకొని స్వచ్ఛభారత్ ప్రోగ్రాం అనుబంధ కార్యక్రమాలను చేపట్టాలనే లక్ష్యంతో స్వచ్ఛ కరీం నగర్‌గా పిలువబడే ఈ పథకానికి సంబంధించి ఎంఓయులపై బాలవికాస, చోళమండలం కంపెనీ ఎంపి వినోద్‌కుమార్ సమక్షంలో సోమవారం ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకరకాల సేవలను అందిస్తూ ప్రథమస్థానంలో ఉన్న బాలవికాస సంస్థను, చోళమండలం కంపెనీ కలిసి స్వచ్ఛ కరీంనగర్ పథకాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి, అగ్రి రూరల్ బిజినెస్ హెడ్ కన్నన్ చోళమండలం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కరీంనగర్ బస్టాండ్‌లో ఒక రూపాయికే ప్యూరిఫైడ్ డ్రింకింగ్ నీరు, రెండు రూపాయలకే ఈ-టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, చోళమండలం కంపెనీ ప్రతినిధులు మహ్మద్ మూవ్యా, హేమంత్‌కుమార్, పామర్తి, ప్రోగ్రాం మేనేజర్ లత, ప్రోగ్రాం ఆఫీసర్ మంజుల, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, బాలవికాస్ డెవలప్‌మెంట్ కమిటీ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.